కథ

# కాకులు

**కలవకుంట్ల గురునాథపిళ్ళై**

నేను, గురప్ప, వేణు ఉపాధ్యాయులుగా ఒకే మండలంలో పని చేశాం. మేం ముగ్గురం స్నేహితులం. ఒకరినొకరం పేర్లు పెట్టి పిలుచుకునేంత సన్నిహితులం. ఒకే నెలలో రిటైరయ్యాం. ప్రభుత్వం నుండి మాకు రావల్సిన అరియర్సంతా వచ్చేసింది. స్టేట్‌బ్యాంకులో మా ఖాతాలలో నిలవ ఉంది. ఇన్నాళ్లూ కూడబెట్టుకొన్న పైకమూ అంతో ఇంతో ఉంది.

ఉన్న పైకాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలా? అని ఆలోచిస్తున్నాం.

ముందుగా అనుకున్న విధంగా ఉదయం పది గంటలకు ఉడిపి హోటల్లో సమావేశమయ్యాం. సంభాషణ నేనే మొదలుపెట్టాను.

"గుర్రప్పా! నా వద్ద పదహైదు లక్షలకు పైగా పైకముంది. చేత ఉంటే వృధాగా ఖర్చు పెట్టేస్తాం. ఒకసారి వృధా చేశామా తిరిగి జీవితంలో సంపాదించలేము. ఏదైనా బ్యాంకులో ఫిక్స్‌డ్ వేసేయండి. నెలనెలా వచ్చే వడ్డీ ఖర్చులకుంచుకుందాం అంటుంది నా శ్రీమతి"

"ఐదు లక్షలు ఖర్చు పెట్టి ఇంటి జాగా కొనండి. పది లక్షలకు ఖర్చు పెట్టి రెండు పోర్షన్ల ఇల్లు కట్టించండి. భవిష్యత్తులో మా అన్నదమ్ముల మధ్య తగాదాలేవీ రావు. మిగిలిన పైకం మీ ఖర్చులకుంచుకోండి. ఒక పోర్షన్‌లో మనముందాం. మరో పోర్షను బాడుగకిద్దాం. ఆ బాడుగతో మీకు వచ్చే పెన్షనుతో ఎలాగో సర్దుకొందాం. మరో ఏడాదికైనా డి.యస్.సి. సెలక్షన్స్ రావా? అందులో నేను ఎంపిక కాకపోతానా? ఆ తరువాత మనకె లాంటి బాధా ఉండదు అంటాడు నా పెద్ద కొడుకు.

'ఇల్లు వద్దు నాన్నా! ఒక లారీ కొనేద్దాం. దాని నిర్వహణ భారం నాకు వదిలేయండి. అందులో వచ్చే ఆదాయం మీకే ఇస్తాను. బి.ఏ. పాసవుతాననే నమ్మకం నాకు లేదు. ప్రభుత్వ ఉద్యోగమేదీ నాకు రాదు' అంటాడు నా చిన్నకొడుకు.

ఎవరి మాటలు వినాలో నాకు అర్థం కావడం లేదు. ఒకరి మాట వింటే మిగిలిన ఇద్దరి మనసులు గాయపడతాయి. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. నీవు చెప్పు. ఏం చేస్తే బాగుంటుంది? అన్నాను.

"రఘూ! ఇల్లు కడితే మన పెట్టుబడి స్థంభించిపోతుంది. ఎదుగుదల అంటూ ఉండదు. వచ్చే బాడుగలంటావా? అర్ధ రూపాయి వడ్డీ కూడా గిట్టదు. ఇక...లారీ కొంటే.. పాపం ఉపశమించుగాక... ఏదైనా ప్రమాదం జరిగితే ఎల్.ఐ.సి. వారి చుట్టూ, పోలీసుల చుట్టూ తిరగవలసి వస్తుంది. ఇదంతా మనకు అవసరమా? 'కృష్ణా' 'రామా' అనుకోకుండా గుడులూ, గోపురాలూ దర్శించకుండా ప్రశాంత జీవనం గడపకుండా, జీవిత చరమాంకంలో మనకెందుకీ ప్రయాసలు. ఫిక్స్‌డ్ వేసెయ్యడం, వచ్చే వడ్డీ నెలనెలా తెచ్చుకొని ఖర్చులకుంచుకోవడం, నా మట్టుకు నాకు మంచిదనిపిస్తున్నది. నా శ్రీమతి అభిప్రాయమూ ఇదే" అన్నాడు గుర్రప్ప.

గుర్రప్ప అభిప్రాయంతో నేనూ ఏకీభవించాను.

బ్యాంకులో వేద్దామా? పోస్టాఫీసులో ఫిక్స్‌డ్లు వేద్దామా? అనుకొంటున్నాము.

కాఫీలు తాగుతూ కూర్చున్నాం.

మాటల మధ్యన ఎందుకో ఒకసారి చుట్టూ చూశాను. మా పక్క టేబుల్ ముందు కూర్చున్న ఒక వ్యక్తి మా మాటలు ఆసక్తిగా వింటున్నట్టనిపించింది. వింటే మాత్రం మా సొమ్మేం పోయింది అనుకున్నాను. అతడు గబాలున లేచి దూరంగా వెళ్లి సెల్‌ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడడం గమనించాను.

"వేణూ! నీవేం మాట్లాడవా? నీ అభిప్రాయమేమిటి?" అని అడిగాను.

"పైకమెక్కడా పుట్టడం లేదు. ఇద్దరు ముగ్గురు పరిచయస్తులు వడ్డీ ఎక్కువ ఇస్తామంటూ నన్ను అప్పులడుగుతున్నారు. ఐదారేళ్లు వడ్డీలకు తిప్పితే ఆ తరువాత శేష జీవితం ఆనందంగా గడచిపోదా అనుకుంటున్నాను"

"బాగుంది. లక్షలకు లక్షలు సంపాదించవచ్చు. కానీ మన వద్ద అప్పు తీసుకున్న వారు రాత్రికి రాత్రే ఉడాయిస్తే అప్పుడు గానీ మనకు చిప్ప చేతికి రాదు" అన్నాను నవ్వుతూ.

గుర్రప్ప ఫక్కున నవ్వేశాడు. రెండు మూడు టేబుళ్ల వద్ద కూర్చున్న వారు మా వైపే చూడడం గమనించి నవ్వులాపేశాం.

"పోనీ చీటీలు వేస్తేనో" అన్నాడు వేణు.

"ఏమిటీ వేణూ! అలా చీటీలు వేసి వసూలైన పైకంతో రాత్రికి రాత్రే పరారైన వారెందరు లేరు? ఐ.పి.లు పెట్టిన వారెందరు లేరు?" అన్నాడు.

ఇంతలో హోటలు ముందు ఒక కారు వచ్చి ఆగింది. అందులోంచి ముగ్గురు వ్యక్తులు దిగి హోటలు లోపలికి అడుగు పెట్టారు.

"నమస్తే సార్!" అంటూ హోటలు యజమాని లేచి వినయంగా నమస్కరించడం చూసాను.

"నమస్తే, నమస్తే బాగున్నారా?" అని వచ్చిన వారిలో ఒక వ్యక్తి అనడం చూసాను.

ఆ వ్యక్తి ఆజానుబాహుడు. నుదుట ఎర్రని బొట్టు, మెడలో చైను, చేతికి బ్రాస్‌లెట్టు, వ్రేళ్లకు ఉంగరాలు 'అబ్బో!' ఖరీదైన వ్యక్తే అనుకొన్నాను.

"ఎవరాయన?" అంటూ అడిగాను గుర్రప్పను.

"ఆయనా? నాయుడని... నాయుడు కమర్షియల్ బ్యాంకు యజమాని కోటీశ్వరుడు"

"నేనూ రెండుసార్లు ఆ బ్యాంకులో చీటీలు వేశా"నన్నాడు గుర్రప్ప.

నాయుడు వాళ్లు వచ్చి మా పక్కనున్న టేబుల్ చుట్టూ ఉన్న కుర్చీలలో కూర్చున్నారు.

"నమస్తే సార్!" నాయుడుగారితో అన్నారెవరో, పరికించి చూద్దును కదా! "అతడెవరో కాదు


ఇందాకా సెల్‌ఫోనులో మాట్లాడిన వ్యక్తి."

"రా విశ్వనాథం, కూర్చో. వెళ్లిన పని చేసుకువచ్చావా?"

"ఆ... నన్ను చూడగానే ఈ నెల వడ్డీ ఇరవై వేలూ కిమ్మనక ఇచ్చాడు సార్"

"ఇవ్వక ఛస్తాడా? మనం ఇచ్చింది పది లక్షలు ప్రామిసరీ నోటు రాయించుకొన్నది ఇరవై లక్షలకు. తోకతిప్పాడా? కోర్టుల చుట్టూ తిరిగి తలబొప్పి కట్టి అంతకంత ఇవ్వాల్సిందే. నాయుడుతో వ్యవహారమంటే మజాకానా?"

మీసం మెలేస్తూ అన్నాడు నాయుడు.



"ఐనా అతడొకమాట అన్నాడు సార్! వడ్డీ కాస్త తగ్గించుకొనమని మీతో చెప్పుకున్నాడు"

"అదేం కుదర్దు. కాకులను కొట్టి గ్రద్దలకు వేయడం మన పద్ధతి కాదయ్యా. ఇలాంటి గ్రద్దలను కొట్టి మనల్ని నమ్ముకొన్న ఖాతాదార్లకు పంచితే పుణ్యమూ, పురుషార్థమూ దక్కుతుంది. మన ఖాతాదార్ల సంక్షేమమే మనకు ముఖ్యం కదా!"

నాయుడుగారి మాటలు విన్నాక ఆయనపై కాస్త గౌరవభావం కలిగింది.

నాయుడు ఒకసారి తల తిప్పి తన చుట్టూ ఉన్న మనుషులను పరిశీలనగా చూసాడు.

"అరెరె! గుర్రప్పా, బాగున్నావా? ఇంకా ఉద్యోగం చేస్తున్నావా? రిటైరయ్యావా?"

"రిటైరయ్యాను సార్!"

"వీళ్లెవరు?"

"వీళ్లు నా స్నేహితులు సార్. నాతో పాటు రిటైరయినవారే"

మా ఇద్దర్నీ పరిచయం చేశాడు గుర్రప్ప.

"ఏయ్! సర్వర్! ఇలారా, వీళ్లందరూ మనకు కావల్సినవారు. తలా రెండిడ్లీలు, ఒక ఉద్దివడ తెచ్చిపెట్టు. అలాగే అందరికీ మసాలా దోసెలు ఆర్డరివ్వు"

"ఎందుకు సార్! మాకప్పుడే టిఫిన్లయ్యాయి. కాఫీలు కూడా తాగేశాం" అన్నాడు గుర్రప్ప.

"ఫర్వాలేదు. తినండి సార్! నా పేరు విశ్వనాథం. అయ్యగారి బేంకులోనే కేషియర్‌గా పనిచేస్తున్నాను"

"పోనీ మసాలా దోసెలైనా తినండి" అన్నాడు నాయుడు.

సర్వర్ అర్థమైనట్లు అక్కడి నుండి వెళ్లిపోయాడు.

"డ్రైవర్! కింగ్‌సైజు గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు ఒక పాకెట్టు తెచ్చిపెట్టు. ఇందా ఈ వందా తీసుకో. మిగిలిన చిల్లర నీవే ఉంచుకో"

మేం ముగ్గురం మసాలా దోసెలు తిన్నాక సిగరెట్లు ఆఫర్ చేశాడు నాయుడు.

"వద్దు సార్! మాకు అలవాటు లేదు" అన్నాం అంతటి పెద్దవాడి ముందు సిగరెట్ తాగడం బాగుండదని.

"సరే! మీకు రావలసిన అరియర్సంతా వచ్చేసిందా?"

"వచ్చింది సార్" అన్నాడు గుర్రప్ప.

"భద్రం. జీవితమంతా కష్టపడితే వచ్చిన డబ్బులు చాలా జాగ్రత్తగా ఖర్చు చేయాలి. ఇంతకూ ఆ మొత్తాన్ని ఎలా ఖర్చు చేద్దామనుకొన్నారు?"

అలా అంటూనే అందరికీ కూల్‌డ్రింకులు తెప్పించాడు నాయుడు.

"పోస్టాఫీసులో వేస్తే బాగుంటుందనుకుంటున్నాం సార్" అన్నాడు గుర్రప్ప.

"మీరు భలే వాళ్లయ్యా. అక్కడ వేస్తే వచ్చే వడ్డీ చాలా తక్కువ"

"మన బ్యాంకులో వేస్తే అంతకన్నా ఎక్కువ వడ్డీ వస్తుంది సార్! మన బ్యాంకులో వేయండి" అన్నాడు విశ్వనాథం.

"ఉద్యోగాలు చేసి రిటైరయినవారు కాస్తో కూస్తో లోకజ్ఞానమున్నవారు, మీరు మా బ్యాంకులో డిపా

జిట్ చేయండి. నెలనెలా వడ్డీ తీసుకు వెళ్లండి. హాయిగా ఉండండి" అన్నాడు నాయుడు.

గుర్రప్ప నా వైపు ఏం చేద్దామన్నట్టు చూశాడు.

నేను అంగీకార సూచనగా తల నాడించాను.

నేను పది, గుర్రప్ప పది, వేణు ఐదు లక్షలు డిపాజిట్టు చేసేలా ఒప్పుకున్నాం.

"మా కారులో వెళ్లండి. ఈ హోటల్ యజమాని రెండు లక్షలివ్వాలి. అది తీసుకొని నేనూ మన బ్యాంకు వద్దకు వస్తాను" అన్నాడు నాయుడు.




ఇంటి వద్ద పెద్ద వాగ్యుద్ధం తరువాత పెద్ద వాడి పేరున ఐదు లక్షలతో ఒక ఇంటి జాగా కొనేట్టు, చిన్నవాడికి లారీ కొని ఇచ్చేటట్టు నిర్ణయమయింది.

నా పేరున ఐదు లక్షలు, నా శ్రీమతి పేరున రెండు లక్షలు డిపాజిట్టు చేసేశాం.

గుర్రప్ప మాట ప్రకారం పది లక్షలు, వేణు ఐదు లక్షలు డిపాజిట్ చేశారు.

నెల నెలా వడ్డీ తెచ్చుకోవడం, ఖర్చు పెట్టుకోవడం, నేనూ, నా శ్రీమతి అప్పుడప్పుడు తీర్థయాత్రలకు వెళ్లడం నాకెంతో సంతోషం కలుగజేసింది.

గుర్రప్పకు ఎక్కువ వడ్డీ వస్తున్నదే, నాకు మాత్రం తక్కువ వస్తున్నదనేది నా మనసులోని బాధ.

రెండేళ్లు ఇట్టే జరిగిపోయాయి.

ఉన్నట్టుండి ఒక రోజు నాయుడి బ్యాంకు దివాళా తీసిందనే దుర్వార్త ఊరంతా వ్యాపించింది.

మేం ముగ్గురం లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటూ బ్యాంకుకు వెళ్లాం.

అప్పటికే కోపోద్రిక్తులైన ఖాతాదార్లు బ్యాంకు కిటికీలు, తలుపులు, ఫర్నిచరూ ధ్వంసం చేసేశారు.

నాయుడు ఐ.పి. పెట్టి బెంగుళూరుకు వెళ్లిపోయాడట.

బ్యాంకు సిబ్బంది అజాపజా లేదు.

ఏడ్చేవాళ్లు ఏడుస్తున్నారు.

శాపనార్థాలు పెట్టేవాళ్లు పెడుతున్నారు.

దొంగలు పడ్డ ఆరు నెలలకు పోలీసులు వస్తారనే మాట నిజమైంది.

పోలీసులు అందరినీ అదుపులో పెట్టారు. 'మీ సొమ్ము ఎక్కడికీ పోదు. మేమున్నాము కదా!' అని హామీలిస్తున్నారు.

నాయుడు ఆస్తులన్నీ సీజ్ చేసేశారు.

నాయుడు కొడుకు బెంగుళూరులో పది కోట్ల పెట్టుబడితో రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తున్నాడని తెలిసింది.

ఇటువంటి సంఘటనలు ఇదివరకే ఎన్నో జరిగాయి. ఎందరో డబ్బులు పోగొట్టుకున్న విషయం అందరికీ తెలిసిందే.

అంతో ఇంతో చదువుకొన్న మాలాంటి వారే తప్పులో కాలేస్తుంటే సామాన్య జనాలదేముంది?

"గ్రద్దలను కొట్టి కాకులకు పంచు తాడట" ఆ నాయుడు మాటలు నమ్మి మోసపోయాం.

ఆ తరువాత కాకులను కొట్టి గ్రద్దలను పంచుకొంటాయనే జనశ్రుతి నమ్మక, నాయుడి మాటలు విన్నాం. ఫలితమనుభవిస్తున్నాం. తరువాత మూడేళ్లకు లక్షకు పది వేలు కోర్టు ద్వారా మాకు ముట్టింది.

మా లాంటి కాకులున్నంత కాలం ఈ సమాజం బాగుపడదు.



## శ్రియ సంబరం

రజనీకాంత్‌కి జోడీగా నటించాను, ఇక కమల్ హాసన్‌తో నటించడమే తరువాయి అని ఆశగా ఎదురుచూస్తున్న శ్రియకి ఆ చాన్స్ వచ్చేసింది. 'మర్మయోగి' సినిమాలో శ్రియకి చాన్స్ ఇస్తున్నట్టు స్వయంగా కమల్- శ్రియకి ఫోన్ చేసి చెప్పాట్ట. అంతే శ్రియ ఆనందానికి అవధుల్లేవు. ఆల్రెడీ త్రిషని హీరోయిన్‌గా తీసుకున్న కమల్- మరో నాయికగా శ్రియను ఎంపిచేసాట్ట. దాదాపు వంద కోట్లకి పై బడ్జెట్‌తో నిర్మాణం కానున్న ఈ సినిమా బహుశా 'రోబో' రిలీజ్ సమయానికే పోటీగా రిలీజ్ కావచ్చునని చెన్నయ్ సినీ జనాల గుసగుసలు.